సాక్షి చిత్తూరు
గురువారం । 23 । జనవరి । 2025



డైయింగ్ .. డేంజర్

నగరిలోని దుస్తుల డైయింగ్ యూనిట్లు నిబంధనలు ఉల్లంఘించడంతో నీరు కలుషితమై ప్రజలకు ప్రమాదకరంగా మారింది. - 8లో



రైళ్ల స్టాపింగ్ రద్దు..

కుప్పం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం ఈ స్టేషన్‌లో పలు రైళ్ల స్టాపింగ్‌ను గురువారం నుంచి రద్దు చేశారు. - 8లో



చిత్తూరుకు నూతన ఓఆర్ఎం

డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు)లో మొట్టమొదటి ఆయిల్ రీజనరేషన్ మిషన్ (ఓఆర్ఎం) సేవలు అందనున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

బొమ్మల తయారీపై ప్రత్యేక శిక్షణ



డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : సంకల్ప పథకం అమలులో భాగంగా బొమ్మల తయారీపై ప్రత్యేక సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సంకల్ప పథకం అమలులో రిసొల్యూట్ బీ టు బీ కన్సల్టెన్సీ సభ్యులు చిత్తూరు జిల్లాలో పర్యటించారన్నారు. ఆ బృందం సభ్యులు జిల్లాలోని పలమనేరు మండలం గంటావూరులో టెర్రకోట మట్టి కుండలు, బొమ్మల తయారీ కేంద్రం, జీడీ నెల్లూరు మండలం కడపగుంటలో ఉన్న తెల్లజిల్లేడు వినాయక బొమ్మల తయారీ కేంద్రాలను పరిశీలించారన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూచనలను బృంద సభ్యులు తీసుకున్నట్లు తెలిపారు. మట్టి బొమ్మల తయారీదారులకు, తెల్ల జిల్లేడు బొమ్మల తయారీదారులకు ఏ ప్రాంతంలో లేని విధంగా ప్రత్యేక సాంకేతికతతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వారు తయారు చేసే వస్తువులకు సదరు సంస్థ జీఐ (భౌగోళిక గుర్తింపు) ట్యాగింగ్ చేసేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, గ్రామీణ వృత్తి కళాకారులకు అదనపు ఆదాయం కల్పించేలా చర్యలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ వెల్లడించారు.

ముగిసిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

- 3,799 మందికి..1,683 మంది అర్హత




పరుగుల పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు (ఈవెంట్స్) బుధవారంతో ముగిశాయి. గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభమైన ఈవెంట్స్ చిత్తూరు ఉమ్మడి జిల్లాలో ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులందరికీ నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఈవెంట్స్ నిర్వహించారు. 5,238 మంది ఈవెంట్స్‌కు హాజరు కావాల్సి ఉండగా 3,799 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులో 1,683 మంది దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించారు తదుపరి నిర్వహించనున్న మెయిన్స్ పరీక్షలకు వీరంతా అర్హత సాధించినట్లేనని చిత్తూరు ఎస్పీ మణికంఠ తెలిపారు. కాగా పలువురు అభ్యర్థులు వారికి నిర్దయించిన తేదీల్లో హాజరు కాకపోవడంతో బుధవారం ఆఖరి అవకాశాన్ని కల్పించారు. ఇందులో పాల్గొన్న పలువురు అర్హత సాధించారు.

పచ్చ క్రీడ

ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్వహణ బాధ్యత సర్కారుదే.. అయినా ప్రైవేటీకరణకు ముందడుగు.. ఇదేం ఇంద్రజాలమో.. మహేంద్రజాలమో తెలియదు.. టెండర్ల జారీకి ఈ నెల 19న నోటిఫికేషన్.. నోటీస్ బోర్డులోకి మాత్రం ఈ నెల 22న ప్రత్యక్షం.. ఇదేమిటని క్రీడాకారుల నిలదీత.. బండారం బయట పడుతుందని తొలగింపు.. వెరసి స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుడికి అప్పనంగా కట్టబెట్టేందుకు ఆడుతున్న పచ్చక్రీడ అని క్రీడాకారుల విమర్శ. ఇదీ చిత్తూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వైచిత్రి.





హడావుడి.. టీడీపీ నేతలకు కట్టబెట్టేందుకేనా?

- ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టుకు ఆగమేఘాలపై టెండర్ నోటిఫికేషన్
- 19న విడుదల చేయాల్సిన నోటిఫికేషన్..ఈ నెల 22న ప్రచురణ
- కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కుతున్న డీఎస్‌డీఓ
- డీఎస్‌డీఓ తీరును ప్రశ్నించినందుకు నోటిఫికేషన్ తొలగింపు
- ఓ ప్రజాప్రతినిధి అనుచరుడికి ఏకపక్షంగా కట్టబెట్టేందుకు కుయుక్తులు

చిత్తూరు టాస్క్‌ఫోర్స్ : జిల్లా క్రీడాప్రాధికార మైదానంలో ఉన్న ఏకైక ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును పచ్చనేతలకు అప్పనంగా కట్టబెట్టేందుకు కుయుక్తులు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రైవేట్ పరం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆగమేఘాలపై బుధవారం బ్యాడ్మింటన్ కోర్టు లీజు నోటిఫికేషన్ ప్రచురించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచురించడం ఏమిటని బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రశ్నించడంతో బండారం బయటపడుతుందని ఆ నోటిఫికేషన్ తొలగించేశారు.

క్రీడలకు పెద్దపీట ఒట్టిమాటే

క్రీడలను అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని సీఎం చంద్రబాబు ఊదరగొడుతున్నారు. అయితే తన సొంత జిల్లా కేంద్రంలో క్రీడాప్రాధికార సంస్థ ఆధీనంలో ఉన్న బ్యాడ్మింటన్ కోర్టును టీడీపీ కార్యకర్తలకు అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఈ తతంగాన్ని చూస్తున్న క్రీడాకారులు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. బ్యాడ్మింటన్ కోర్టును క్రీడాప్రాధికార సంస్థ అధికారులే నిర్వహించే అవకాశం ఉంది. అయితే అలా చేయకుండా బ్యాడ్మింటన్ కోర్టును టీడీపీ కార్యకర్తలకు లీజుకు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

ఆగమేఘాలపై నోటిఫికేషన్

జిల్లా కేంద్రంలోని క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు లీజుకు ఇచ్చేందుకు హడావుడిగా



19 వ తేదీన పెట్టాల్సిన నోటిఫికేషన్‌ను 22 వ తేదీన నోటీస్‌బోర్డులో పెట్టిన దృశ్యం



బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రశ్నించడంతో నోటీస్‌బోర్డులో నోటిఫికేషన్‌ను తొలగించిన దృశ్యం

పచ్చనేతల కోసమేనంటున్న క్రీడాకారులు

జిల్లా కేంద్రంలోని క్రీడాప్రాధికార సంస్థలో ఉన్న బ్యాడ్మింటన్ కోర్టును చిత్తూరు ప్రజాప్రతినిధి అనుచరుడికి అప్పజెప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ప్రత్యేక ఆసక్తి చూపడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ ఆదేశాలను సైతం తుంగలో తొక్కి పచ్చనేతల పరం చేసేందుకు కుట్రలు సాగిస్తున్నారని తెలిసింది. జిల్లా కేంద్రంలోని క్రీడాప్రాధికార సంస్థలో ఉన్న బ్యాడ్మింటన్ స్టేడియంలో నాలుగు కోర్టులున్నాయి. ఆ నాలుగు కోర్టులను చిత్తూరు ప్రజాప్రతినిధి అనుచరుడికి ఇచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెండర్ నోటిఫికేషన్‌ను జారీచేశారు. ఈ నెల 24వ తేదీన టెండర్లు స్వీకరణ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే టెండర్ల జారీకి ఐదు రోజులు ముందు అంటే ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేసి నోటీసు బోర్డులో పెట్టాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా నోటిఫికేషన్‌ను ఈ నెల 22వ తేదీన నోటీసు బోర్డులో పెట్టారు. ఎలాంటి ప్రచారం లేకుండానే లోలోపలే నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో పెట్టి ప్రజాప్రతినిధి అనుచరుడికి ఏకపక్షంగా కట్టబెట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఈ తతంగాన్ని పరిశీలించిన కొందరు బ్యాడ్మింటన్ క్రీడాకారులు బుధవారం సాయంత్రం డీఎస్‌డీఓను ప్రశ్నించారు. ఈ విషయం బయటకు పొక్కితే ఇబ్బందులు వస్తాయని భావించి నోటీస్ బోర్డులో పెట్టిన నోటిఫికేషన్‌ను తొలగించేశారు. ఈ అక్రమ టెండర్ల తతంగాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారులు కోరుతున్నారు.

ఫోర్జరీ సంతకంపై పోలీసులకు ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ కోసం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీ జరిగింది. సంతకంతోపాటు ఆ పత్రంలోని సీలు డమ్మీ అని తేలింది. ఈ బోగస్‌ను పసిగట్టి రిజిస్ట్రార్ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సాక్షి దినపత్రికలో కూడా 'ఆగని ఫోర్జరీ దందా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై పూర్తి వివరాలు సేకరించిన తహసీల్దార్ తాలూకా పోలీసులకు ఫోర్జరీ సంతకంపై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు ఎంజాయిమెంట్ దరఖాస్తు ఫారం తదితరాలను జత కూడా చేయనున్నారు. ఫోర్జరీ దందాపై విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి స్పెల్ బీ పోటీల్లో జ్యోతిషా ప్రతిభ



జ్యోతిషాను అభినందిస్తున్న కరస్పాండెంట్ మహేష్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఏటా సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెల్ బీ పోటీల్లో జిల్లా కేంద్రంలోని సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాల విద్యార్థిని జ్యోతిషా ప్రతిభ చూపించింది. ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో సాక్షి స్పెల్ బీ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జ్యోతిషా పాల్గొని, తృతీయ స్థానం సాధించింది. కాంస్య పతకంతో పాటు రూ.3 వేలు నగదు బహుమతి అందుకుంది. ఆ విద్యార్థిని రాష్ట్రస్థాయి స్పెల్ బీ పోటీల్లో వరుసగా రెండోసారి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు ప్రతిభ చాటిన ఆ విద్యార్థినిని బుధవారం సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాల కరస్పాండెంట్‌లు సీఆర్.మహేష్ రెడ్డి, వాస శ్రీనివాస, పాఠశాల టీచర్లు అభినందించారు.

దివ్యాంగుల పింఛన్లపై విచారణ



దివ్యాంగుడి వద్ద వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక వైద్య బృందం సభ్యులు

పాలసముద్రం : మండలంలోని 85 శాతానికి పైగా వైకలత్వం ఉండి మంచానికే పరిమితమై ప్రభుత్వం ద్వారా రూ.15 వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగులను బుధవారం వైద్యాధికారుల బృందం విచారణ జరిపింది. కోస్తా జిల్లా ఉదయగిరి తీర్థం డాక్టర్ శివరామ్, అల్లూరు నుంచి అనురాధ, వెంకటగిరికోట నుంచి విజయకాంత్, తీర్థం నుంచి శివకుమార్, తిరుపతి రుయా ఆస్పత్రి డాక్టర్ కృష్ణకుమార్, సూర్యుడు, డిజిటల్ అసిస్టెంట్ డార్విన్, చంద్రశేఖర్ బృందం మండలంలోని 13 పంచాయతీల్లో మొత్తం 45 మంది మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై విచారణ జరిపారు. మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.15 వేలు పింఛన్ ఇవ్వలేక, వారి వైకల్య సర్టిఫికెట్‌లోని పర్సెంటేజీని తగ్గించి, వారిని రూ.4 వేలు, రూ.6 వేలు పింఛన్‌దారులుగా కుదింపు చేసేందుకే ఈ విచారణ చేపట్టారని, లేకుంటే పింఛన్ తొలగిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే పింఛన్ పెంచామని కూటమి ప్రభుత్వం ఊదరగొడుతోంది. కూటమి సర్కారు గత ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌ని ఏదో ఒకసాకు చూపి తొలగించి ఆ సొమ్మునే కొందరికి ఇవ్వడానికి చూస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజల్లో పెద్దిరెడ్డి



ఆలయం ఎదుట ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు, ఎంపీ మిథున్ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలోని సదుమమ్మ ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ పూజల్లో ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి దంపతులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా మాజీ సభ్యుడు సుధీర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నిహాంత్ రెడ్డి, అభినయ్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

నేడు జాతీయ ఉర్దూ సదస్సు, కవి సమ్మేళనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన జాతీయ ఉర్దూ సదస్సు, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉర్దూ భాష స్థితిగతులు అనే అంశంపై సదస్సులో వక్తలు పేపర్ ప్రెజెంటేషన్‌తో పాటు చర్చిస్తారన్నారు. ఆ తర్వాత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తారన్నారు. కళాశాల ఉర్దూ విభాగాధిపతి డాక్టర్ అన్వర్ హుసేన్ మాట్లాడుతూ తాను రచించిన ఉర్దూకే ముంతఖబ్ సఫర్ నామోం కా తహ్ కీఖీ-ఓ-తన్ ఖీది జాయిజా అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎస్వీ యూనివర్సిటీ ఉర్దూ ఆచార్యులు డాక్టర్ నిసార్ అహ్మద్, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ వసీఉల్లా బఖ్తియారి పాల్గొంటారని వెల్లడించారు.

వీరుడా.. నీ త్యాగం చిరస్మరణీయం

దేశ భద్రతలో కీలకపాత్ర పోషించావు.. అరాచక శక్తుల నుంచి కంటికి రెప్పలా దేశ ప్రజలను కాపాడావు.. భరతమాత సేవకు కంకణబద్ధుడివై కఠోర శిక్షణ పొందావు.. ఉగ్రమూకల ఆట కట్టించడంలో అలుపెరగని పోరు సాగించావు.. ఈ పోరులో అశువులు బాసిన ఓ వీరుడా.. నీ త్యాగం చిరస్మరణీయం.. అజరామరం.. సైనికుడా అమరహే.. అంటూ ఎగువరాగిమానుపెంట వాసులు జవాన్ కార్తీక్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అశ్రునయనాలతో నివాళులర్పించారు.



అంతిమయాత్రలో పాల్గొన్న జనం(ఇన్‌సెట్)కార్తీక్ భౌతిక కాయం



కార్తీక్ ఫొటోతో భౌతిక కాయం ముందు వెళుతున్న తల్లిదండ్రులు

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళి
- ఆదుకుంటామన్న కలెక్టర్, ఎమ్మెల్యే
- వీరజవాన్ కార్తీక్ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు, యువకులు

బంగారుపాళెం: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రమూకల ఎదురు కాల్పుల్లో గాయపడి వీరమరణం చెందిన జవాన్ పంగల కార్తీక్ అంతిమ సంస్కారాలను బుధవారం అధికార లాంఛనాలతో ఎగువరాగిమానుపెంట గ్రామంలో నిర్వహించారు. బెంగళూరు నుంచి కార్తీక్ భౌతిక కాయాన్ని మిలటరీ అధికారులు బంగారుపాళెం మండలం ఎగువరాగిమానుపెంట గ్రామానికి తీసుకువచ్చారు. ఉదయం 5.30 గంటలకు బంగారుపాళేనికి చేరుకుంది. పాలేరు అండర్ బ్రిడ్జి వద్దకు కార్తీక్ బంధువులు, స్నేహితు లు, గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కార్తీక్ పార్థివదేహాన్ని తీసుకు వచ్చిన వాహనాన్ని చూడగానే వీరజవాన్ కార్తీక్ అమరహే, భారతమాతకు జై అంటూ రహదారి పొడవునా నినాదాలు చేసుకుంటూ స్వగృహం వరకు తీసుకువెళ్లారు. కార్తీక్ భౌతికకాయాన్ని చూసిన తల్లిదండ్రులు సెల్వి, వర దరాజులు, కుటుంబ సభ్యులు బోరున విలపించా రు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వీరజవాన్ కార్తీక్ పార్థివదేహాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువకులు సందర్శించి నివాళులు అర్పించారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళి

ఎగువరాగిమానుపెంట గ్రామంలో వీరజవాన్ కార్తీక్ పార్థివదేహాన్ని బుధవారం పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏఎస్పీ హర్షవర్ధన్, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, పలమనేరు ఆర్డీఓ భవానీ, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, స్థానిక సర్పంచ్ శ్రీహరి, పలువురు మాజీ సైనికులు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

కార్తీక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ఉగ్రవాదుల పోరులో అసువులు బాసిన వీరజవాన్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ప్రభుత్వ పరంగా అండగా నిలిచి అందాల్సిన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఓ కార్యాలయం ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్తీక్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. కార్తీక్ చదివిన పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 5 ఎకరాల పొలం కూడా మంజూరు చేస్తామన్నారు. కార్తీక్ కుటుంబం ఉంటున్న కాలనీకి వీరజవాన్ పేరు పెడతామన్నారు. వీరజవాన్ కార్తీక్ దేశం కోసం చేసిన త్యాగం యువతకు ఆదర్శమన్నారు.

అధికారలాంఛనాలతో అంతిమ సంస్కారాలు

ప్రభుత్వ ఆధికార లాంచనాలతో వీరజవాన్ కార్తీక్ అంతిమ సంస్కారాలు జరిగాయి. కార్తీక్ భౌతిక కాయాన్ని మిలటరీ అధికారులు వాహనంలో వ్యవసాయ క్షేత్రానికి తీసుకు వెళ్లారు. కార్తీక్ చివరి చూపు కోసం అంతిమ యాత్రలో పెద్దసంఖ్యలో ప్రజలు, యువకులు పాల్గొన్నారు. వీరజవాన్ కార్తీక్ అమరహే అంటూ యాత్రగా తరలివచ్చారు. 48 గుర్కా రైఫిల్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్ సింగ్ గిల్ నేతృత్వంలో శ్రీనగర్‌కు చెందిన సుబేదార్లు మహేష్, భరత్, పటేల్‌తోపాటు సైనికులు కార్తీక్ వీరమరణానికి గుర్తుగా జవాన్లు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్తీక్ అంత్యక్రియలను పూర్తి చేశారు. అంతిమ సంస్కారాలు ముగిసేంత వరకు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు అక్కడే ఉన్నారు.



గాలిలో కాల్పులు జరుపుతున్న జవాన్లు



పార్థివదేహం వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కార్తీక్ కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి



వీరజవాన్ కార్తీక్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం చెందిన జవాన్ పంగల కార్తీక్ కుటుంబానికి తక్షణం రూ.50 లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎగువరాగిమానుపెంట గ్రామంలో కార్తీక్ భౌతిక కాయాన్ని సునీల్ కుమార్‌తో పాటు జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, సింగ్ విండో మాజీ అధ్యక్షులు దత్తాత్రేయరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, ఉపసర్పంచ్ కామరాజు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు సర్దార్, ఎస్సీ సెల్ నాయకుడు నాగరాజ, ఎన్ఆర్ఐ భరత్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఐరాలకు చెందిన జవాన్ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.50 లక్షలు అందించారన్నారు. కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు అందించాలని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఒరిగిపోయిన బస్సు



రోడ్డు పక్కన దిగబడి ఉన్న బస్సు

వెదురుకుప్పం: మండలంలోని గెరిగదొన సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు పక్కకు ఒరిగింది. కార్వేటినగరం నుంచి తిరుపతికి ప్రయాణికులతో వస్తున్న బస్సు ఎదురుగా వస్తున్న వాహనానికి దారి వదిలే క్రమంలో పక్కకు వైదొలగడంతో చక్రాలు రోడ్డు పక్కన మట్టిలో కూరుకుపోయి, ఒరిగిపోయింది. దీంతో బస్సు కదలకపోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

బస్‌షెల్టర్‌లో మద్యం విక్రేత అరెస్టు


నిందితుడు కరుణాకర్‌రెడ్డి

చౌడేపల్లి:మండల కేంద్రంలోని బస్‌షెల్టర్‌లో మద్యంను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. పెద్దపంజాణి మండలం నగిరేపల్లెకు చెందిన కరుణాకర్‌రెడ్డి బస్‌షెల్టర్‌లో ఉదయం మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేసి, మద్యం విక్రయిస్తున్న అతడిని అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న 24 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లుఎస్‌ఐ పేర్కొన్నారు.

డైయింగ్.. డేంజర్

వస్త్ర పరిశ్రమకు పెట్టిన పేరు నగరి.. దుస్తులకు రంగుల అద్దకం యూనిట్లు ఇక్కడ అధికం.. ఆ యూనిట్లలో వస్త్రాలకు రంగుల అద్దకానికి విషపూరిత రసాయనాల వాడకం.. ఇందుకు వినియోగించే నీరు కలుషితం.. ఆ జలం యథేచ్ఛగా రోడ్లు.. కాలువలు.. ఖాళీ స్థలాల్లోకి విడుదల.. వెరసి భూగర్భజలాలు కలుషితం.. సారవంతమైన భూములు నిస్సారం..ఫలితం ప్రజలకు ప్రాణాంతక వ్యాధులు.. అయినా పట్టించుకోని అధికార గణం.. ఇదీ అద్దకం పరిశ్రమ నిర్వాకం.

పాషాణజలం
- కాలుష్యకోరల్లో నగరి
- రోడ్డుపై ప్రవహించిన రసాయననీరు
- చింతలపట్టెడలో కలకలం
- పండగ సెలవులకు ఈటీపీ నిలిపివేత
- అయినా కాలువలు, రోడ్లపై కలుషిత జలం


చింతలపట్టెడలో రోడ్డుపై ప్రవహిస్తున్న రసాయన వ్యర్థ జలాలు

నగరి : మున్సిపాలిటీలోని డైయింగ్ యూనిట్లు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. డైయింగ్‌కు వినియోగించే ప్రమాదకర రసాయనాలతో కూడిన కలుషిత వ్యర్థ జలాలు నేరుగా మురుగునీటి కాలువలు, పారుదల కాలువల్లోకి, చెరువుల పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువుల్లోని నీరు, భూగర్భ జలాలు విషపూరితమవుతున్నాయి. సారవంతమైన సాగు భూములు నిర్జీవంగా మారిపోతున్నాయి. ప్రజలకు ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. ప్రమాద స్థాయి తెలిసినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

రెండింటికే అనుమతి

నగరి మున్సిపల్ పరిధిలో 18 మిషన్ డైయింగ్ యూనిట్లు ఉండగా సుమారు 90 మాన్యువల్ డైయింగ్ యూనిట్లు ఉన్నాయి. నిబంధనల మేరకు మిషన్ డైయింగ్ యూనిట్లు సొంతంగా రసాయన నీటి శుద్ధీకరణ ప్లాంటు(ఈటీపీ) పెట్టుకోవాలి. మాన్యువల్ డైయింగ్ యూనిట్లకు మహానేత వైఎస్సార్ పాలనలో కామన్ ఈటీపీ ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి వినియోగంలోకి రాని ఆ ఈటీపీని మాజీ మంత్రి ఆర్కేరోజా వినియోగంలోకి తెచ్చారు. అయితే పలు మాన్యువల్ డైయింగ్ యూనిట్ల వారు ప్లాంటుకు అనుసంధానం కాలేదు. మరో వైపు 18 భారీ డైయింగ్ యూనిట్లు ఉంటే అందులో రెండింటికి మాత్రమే అనుమతి ఉందని ఆ యూనిట్లు కూడా నిబంధనలు పాటించడం లేదని మున్సిపల్ సమావేశంలోనే అధికారులు వెల్లడించారు. పలు ప్రాంతాల్లో నీటిని పరిశీలిస్తే అందులో జింక్, ఆర్సినిక్ కలిసి ఉందని వీటి కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని తేల్చారు. తమిళనాడుకు చెందిన వారే ఈ భారీ డైయింగ్ యూనిట్లు నడుపుతూ రసాయనాలు ఇక్కడ వదిలేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో నెల రోజుల్లోపు డైయింగ్ యూనిట్ల మూకుమ్మడిగా ఆపేయడంపై కీలక నిర్ణయం తీసుకుంటామని కౌన్సిల్ ప్రకటించింది.


పంప్ హౌస్ వద్ద నిల్వ చేరిన డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చిన వ్యర్థ నీరు

రోడ్డుపై కలుషిత నీరు

ఒకవైపు మున్సిపల్ కౌన్సిల్ డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తుంటే మరోవైపు చింతలపట్టెడలో మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి పొగలు కక్కుతూ వేడి రసాయనీరు రోడ్లపైన, కాలువల్లోను ప్రవహించడం కలకలం రేపింది. నగరి చెరువును ఆనుకుని ఉన్న ఈటీపీ పంప్‌హౌస్ సమీపంలో కూడా కొత్తపేట, ఏకాంబర కుప్పం, సత్రవాడల్లోని మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి భారీగా వచ్చిన వ్యర్థ జలాలు నిల్వ చేరాయి.

సెలవుల్లో ఆపేసిన కామన్ ఈటీపీ

మున్సిపల్ పరిధిలోని మాన్యువల్ డైయింగ్ యూనిట్లు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డైయింగ్ ఆపేశాయి. అవి పనిచేస్తే శుద్ధి చేసిన నీరే బయటకు రావాలి. అయితే రసాయన నీరు పొగలు కక్కుతూ పలు ప్రాంతాల్లో పారడంతో మిషన్ డైయింగ్ యూనిట్లు ఈటీపీ వినియోగించడం లేదని, నిబంధలు ఏవీ పాటించడం లేదని రుజువైంది.

సల్మా దంపతులకు ఆహ్వానం


విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న సల్మా, సర్దార్‌షరీఫ్ దంపతులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పలు పథకాల ద్వారా దేశవ్యాప్తంగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం నాడు జిల్లా నుంచి రాష్ట్రపతి విందుకు రావాలని చిత్తూరు న్యూ ప్రశాంత్‌నగర్‌కాలనీకు చెందిన సల్మా, సర్దార్ షరీఫ్‌కు ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి అవాస్‌యోజన్ పథకం కింద గృహ రుణం పొంది ఇల్లు కట్టుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో తమకు గృహ రుణం వచ్చిందన్నారు. అప్పట్లో గృహరుణం పొందటానికి సహకారం అందించిన విజయానందరెడ్డికు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన హేమంత్

గుడిపాల: చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి బొమ్మసముద్రం సమీపంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఉన్నట్టుండి కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. నాగేంద్రపురం గ్రామానికి చెందిన హేమంత్(21) చిత్తూరు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఉన్నట్టుండి కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైళ్ల స్టాపింగ్ రద్దు.. ప్రయాణికులకు అగచాట్లు

- 15 రోజులు పాటు రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ రద్దు
- కుప్పంలో నేటి నుంచి అమలు

కుప్పం: స్థానిక రైల్వే స్టేషన్‌లో చెన్నై- బెంగళూరు రైలు సర్వీసుల స్టాపింగ్‌ను గురువారం నుంచి 15 రోజులపాటు రద్దు చేశారు. దీంతో కుప్పం నుంచి బెంగళూరుకు నిత్యం రాకపోకలు సాగించే రైలు ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. ఐదేళ్ల కిందట కుప్పం రైల్వేస్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో మూడేళ్లుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు వేగవంతగా చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్లే రైలును కుప్పం రైల్వేస్టేషన్‌లో 15రోజుల పాటు స్టాపింగ్ రద్దు చేశారు.


కుప్పం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులు

ప్రయాణికులకు అవస్థలు

కుప్పం నుంచి బెంగళూరు నగరానికి నిత్యం వేల సంఖ్యలో కూలీలు రాకపోకలు సాగిస్తారు. ప్రతి రోజు ఉదయం బయలుదేరి బెంగళూరు కూలీ పనులు ముగించుకుని సాయంత్రం కుప్పం పట్టణానికి తిరిగి వస్తారు. కుప్పం రైల్వే స్టేషన్‌లో రైళ్ల స్టాపింగ్ రద్దు కావడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయంగా..

కుప్పం ప్రాంత వాసులు రైలు రాకపోకలకు ప్రత్యామ్నాయం కల్పించాలని రైల్వే అధికారులు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారులు కుప్పం స్టేషన్ సమీపంలోని మల్లానూరు రైల్వే స్టేషనలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు అనుమతులు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రోజూ తిరుపతి ఎక్స్‌ప్రెస్, బృందావనం, లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్, డబుల్ డక్కర్ సాయంత్రం మైసూర్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు , ఇంటర్ సిటీ, రైలు మల్లానూరు స్టేషన్‌లో ఆపనున్నారు. అంతేకాకుండా ప్రతి రోజు కుప్పం నుంచి బెంగళూరు వెళుతున్న పుష్‌పుల్ లోకల్ రైలు యథావిధిగా రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

వేగం కన్నా.. ప్రాణం మిన్న


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేగం కన్నా.. ప్రాణం మిన్న అని, మనిషి ప్రాణాలు చాలా విలువైనవని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా రవాణాశాఖ అధికారులు బుధవారం చిత్తూరు దర్గా సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు వాకథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత మూడేళ్ల కాలంలో జిల్లావ్యాప్తంగా దాదాపు 350 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. గతేడాది 120 మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. దీని దృష్ట్యా జాతీయ రహదారి భద్రతపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమించిందన్నారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, రోడ్ సేఫ్టీ మీటింగ్‌లు, వాకథాన్ నిర్వహించామన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం సరైన విధానం కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించడంలో పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చూడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, డీటీసీ నిరంజన్ రెడ్డి, ఎంవీఐలు రాజేశ్వరరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం విక్రేతల అరెస్టు

– రూ.21 లక్షల స్వాధీనం

సోమందేపల్లి(కర్ణాటక): తక్కువ ధరకే మేలిమి బంగారాన్ని అందజేస్తామని నమ్మబలికి నకిలీ బంగారం అంటగట్టి డబ్బుతో ఉడాయించిన కేసులో పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాజా కృష్ణబాబు, కర్ణాటకకు చెందిన శాంతరాజు, నయాజ్ అహమ్మద్, ఈరన్న, బాబు, అర్జున్, ఆనంద్‌బాబు, బంగారి, ఈడిగ హరిప్రసాద్ ఓ ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం దందా చేపట్టారు. ఈ క్రమంలోనే నకిలీ బంగారపు పూసల దండలు సేకరించుకుని, అందులో కొన్ని మేలిమి బంగారం పూసలను చేర్చారు. అనంతరం కొనుగోలుదారులు పరీక్షించుకునే సమయంలో మేలిమి బంగారం పూసలను మాత్రమే చూపించేవారు. ఇటీవల అనంతపురం జిల్లా విడపనకల్లుకు చెందిన ఈశ్వరన్న, చిత్తూరు జిల్లా కుప్పం నివాసి ముని వెంకటేష్‌కు ముఠా సభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. తమకు తవ్వకాల్లో మేలిమి బంగారం లభ్యమైందని, తక్కువ ధరకే వాటిని విక్రయిస్తామని నమ్మబలికారు. వారి మాయలో చిక్కుకున్న ఇద్దరినీ ఈ నెల 9న సోమందేపల్లి బ్రాహ్మణపల్లి వద్దకు రప్పించుకున్నారు. తొలుత ఈశ్వరన్న వద్ద రూ.8 లక్షలు తీసుకున్నారు. అనంతరం ముని వెంకటేష్ వద్ద రూ.13 లక్షలు తీసుకుని ఇద్దరికీ నకిలీ బంగారం పూసల దండలు చేతిలో పెట్టి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించారు. కాసేపటి తర్వాత వాటిని పరిశీలించుకున్న ఈశ్వరన్న, ముని వెంకటేష్ అవి నకిలీవని నిర్ధారించుకుని వెంటనే సీఐ రాఘవన్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ రమేష్‌బాబు బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టి బుధవారం పక్కా ఆధారాలతో మొత్తం పది మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.21 లక్షల నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తక్కువ మొత్తానికి బంగారం ఇస్తామని ఫోన్లు చేసి ఆశ చూపితే ఆకర్షణకు గురి కావద్దని ప్రజలకు సూచించారు.

టోల్ గేట్ సిబ్బందితో గొడవ.. నలుగురిపై కేసు

వి.కోట:టోల్ గేట్ సిబ్బందితో గొడవపడి, దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మండలంలోని ఖాజీపేటకు చెందిన అద్నా న్ అనే యువకుడు మరో ముగ్గురు యువకులతో కలిసి మంగళవారం రాత్రి పలమనేరు నుంచి కారులో వస్తూ మండలంలోని దానమయ్యగారిపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్‌లో తన కారును ఎలాంటి రుసుము తీసుకోకుండా వదలాలని అక్కడ సిబ్బందితో గొడవపడ్డారు. అంతేకాక వారిపై దాడి చేసి, బెదిరించారు. దీనిపై టోల్‌గేట్ మేనేజర్ రామాంజినేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అద్నాన్ అనే వ్యక్తితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చిత్తూరుకు నూతన ఓఆర్ఎం

చిత్తూరు కార్పొరేషన్: డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు)లోనే మొట్టమొదటి ఆయిల్ రీజనరేషన్ మిషన్(ఓఆర్ఎం) చిత్తూరు నుంచి సేవలు అందించనుంది. గత పాలనలో ఈ ప్రాజెక్టును రూ.50 లక్షల వ్యయంతో మంజూరు చేశారు. ఎన్నికల ముందు మిషన్ మంజూరు కావడం కోడ్ తదితర విషయాలతో ఈ అంశాన్ని పక్కన పెట్టారు. తొలుత తిరుపతి జిల్లా రేణిగుంటకు మంజూరు చేశారు. అక్కడ స్పెషల్ మెయింటెన్స్(ఎస్‌పీఎం) కేంద్రం మరమ్మతు పనులు జరుగుతుండడంతో చిత్తూరుకు బదిలీ చేశారు. వేసవి సమీపిస్తుండడంతో నూతన ఓఆర్‌ఎంను చిత్తూరు కేంద్రంలో అమర్చారు. సాంకేతికంగా అందుబాటులో రావడానికి వారం పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

రూ.50 లక్షల వ్యయంతో ప్రాజెక్టు.. చిత్తూరుకు కేటాయింపు

వేసవి వచ్చిందంటే చాలు వ్యవసాయ, ఇళ్లకు విద్యుత్ సరఫరా కోసం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు వేడికి ఎక్కువగా కాలిపోతుంటాయి. వీటిని ట్రాన్స్‌కో స్పెషల్ మెయింటెన్స్(ఎస్‌పీఎం) తీసుకొచ్చి మరమ్మతు చేసి పంపుతారు. ట్రాన్స్‌ఫార్మర్లు అధిక మొత్తంలో మరమ్మతుకు రావడంతో వాటిని బాగు చేయడానికి సమయం పడుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని గత పాలనలో రూ.50 లక్షల వ్యయంతో డిస్కంలో మోడల్‌గా మొట్టమొదటి ఓఆర్‌ఎంను ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. తొలుత రేణిగుంట ఎస్‌పీఎంకు మంజూరు చేయగా అక్కడ మరమ్మతు పనులు జరుగుతుండడంతో చిత్తూరుకు బదిలీ చేశారు. జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఎస్‌పీఎం కేంద్రాలున్నాయి. చుట్టూ పక్కల నియోజకవర్గాల నుంచి పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను ఇక్కడ రైతులు, సిబ్బంది మరమ్మతు చేసుకుంటుంటారు. జిల్లాలో రోజు 30 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు కోసం వస్తున్నాయి. వేసవిలో ఈ సంఖ్య మరో 20కి పెరుగుతాయి. ట్రాన్స్‌ఫార్మర్లలో తీగలు కాలిపోవడం, ఆయిల్ మార్పు సమస్యలే ఎక్కువగా వస్తుంటాయి. చిత్తూరు కేంద్రానికి రోజు దాదాపు 10 ట్రాన్స్‌ఫార్మర్ల వరకు మరమ్మతు కోసం వస్తున్నాయి. ఇందులో సగం ఆయిల్ మార్పు చేయాల్సినవే ఉన్నాయి. 16 కేవీ సామర్థ్యం గల వాటికి 50 లీటర్లు, 25 కేవీ సామర్థ్యం ఉన్న వాటికి 70 లీటర్ల ఆయిల్‌ను రీజనరేషన్ చేసి వాడుతున్నారు. పాత మిషన్ 200 లీటర్లను మాత్రమే శుద్ధి చేస్తుంది. రోజు 3–4 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఆయిల్ మార్చవచ్చు. కొత్త మిషన్ రోజు 2 వేల లీటర్లు శుద్ధి చేసి కొత్త ఆయిల్‌గా మారుస్తుంది. అంటే దాదాపు 50 ట్రాన్స్‌ఫార్మర్లకు కావాల్సిన ఆయిల్‌ను సిద్ధం చేయనుంది. డిమాండ్ ఆధారంగా జిల్లాలోని మిగిలిన ఎస్‌పీఎం కేంద్రాలకు ఆయిల్ చిత్తూరు నుంచి పంపవచ్చు. ఆయిల్ బ్రేక్ డౌన్ ఓల్టేజీ(బీడీవీ) శాతం 40–45 మధ్య ఉండేలా పాత మిషన్‌లో శుద్ధి చేస్తున్నారు. ఇందుకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఆధునిక సదుపాయాలతో పనిచేసే కొత్త మిషన్‌లో బీడీవీ 50 శాతంతో రోజు 2 వేల లీటర్లను శుద్ధి చేయనుంది.


చిత్తూరు ఎస్‌పీఎంలో మరమ్మతుకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు


శుద్ధి చేసిన నూనెను ట్రాన్స్‌ఫార్మర్‌లో నింపుతున్న కార్మికుడు

ఆయిల్ త్వరగా శుద్ధి

“ డిస్కంలో మొట్టమొదట ఆయిల్ రీజనరేషన్ మిషన్ చిత్తూరులో పెట్టారు. ఆయిల్ శుద్ధిగా ఉంటే ట్రాన్స్‌ఫార్మర్లు పెద్దగా పాడైపోవు. కొత్త మిషన్‌లో రోజు 2 వేల లీటర్లు ఆయిల్ శుద్ధి కానుంది. వారంలో పనులు ప్రారంభించనున్నాం. వేసవి సమయంలో సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్‌ను శుద్ధి చేసి వేగంగా పంపవచ్చు.

– ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో